క్లుప్తంగా

బస్ సర్వీస్ ప్రారంభం



నర్సంపేట : నర్సంపేటకు చెందిన జిల్లా హైర్ బస్ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, పదో వార్డు కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్‌కు చెందిన నర్సంపేట-నిజామాబాద్ నూతన ఎక్స్‌ప్రెస్ బస్‌సర్వీస్‌ను స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) ప్రసన్నలక్ష్మి, సీఐ భవానీ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో సెక్యూరిటీ హెడ్ గార్డ్ వీరారెడ్డి, నాగిశెట్టి ప్రవీణ్, కొమురయ్య, వినీత్, పాల్గొన్నారు.

మాలధారణ



పర్వతగిరి : స్థానిక శ్రీకంఠమహేశ్వరస్వామి సమేత సులమాంబ, వనం ఎల్లమ్మ, వనం మైసమ్మ ముహూర్తం సందర్భంగా గౌడ కులస్తులు సోమవారం మాలధారణ చేశారు. కార్యక్రమంలో ఏనుగటి శ్రీనివాస్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వీరస్వామిగౌడ్, సంఘం అధ్యక్షుడు పుల్లూరి సారయ్య, గౌరవ అధ్యక్షుడు రంగు జనార్దన్, రంగు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు దొనికేని దయాకర్, చీకటి యాకన్న, జనగాం శ్రీనివాస్, మాలధారణ వేసిన గౌడ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

దళిత మోర్చా కన్వీనర్‌గా మార్టిన్ లూథర్

గీసుకొండ : బీజేపీ అనుబంధ దళిత మోర్చా జిల్లా కన్వీనర్‌గా వరంగల్ నగరానికి చెందిన పాలెపాక మార్టిన్ లూథర్‌ను నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కోకన్వీనర్లుగా 39వ డివిజన్‌కు చెందిన మా దాసు రాజు, నర్సంపేట పట్టణానికి చెందిన కూనమల్ల పృథ్వీరాజ్, పర్వతగిరికి చెందిన బొట్టు మధులను నియమించినట్లు పేర్కొన్నారు.

నర్సరీ షేడ్ నెట్ చోరీ

చెన్నారావుపేట : నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా ఏర్పాటు చేసిన షేడ్ నెట్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన మండలంలోని పత్తినాయక్‌తండాలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పంచాయతీ కార్యదర్శి నిట్టు కథనం ప్రకారం.. స్థానిక గ్రామ పంచాయతీ నర్సరీలో మొక్కలు ఎండకు ఎండిపోకుండా గతంలో షేడ్ నెట్ ఏర్పాటు చేశారు. కాగా షేడ్ నెట్ ఆదివారం రాత్రి చోరీకి గురైంది. సోమవారం ఉదయం నర్సరీ వద్దకు వెళ్లి చూడగా షేడ్ నెట్ లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

క్రమశిక్షణతోనే విద్యార్థుల ఉన్నతి



వర్ధన్నపేట : క్రమశిక్షణ అలవర్చుకుంటేనే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని శ్రీ అరబిందో స్కూల్ హెచ్‌ఎం దిలీప్ సింగ్, అకడమిక్ డీన్ వీరన్న తెలిపారు. ఆ స్కూల్‌లో ప్రైమరీ స్కూల్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే సోమవారం నిర్వహించారు. తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, డీన్ మాట్లాడారు. విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలతో ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జ్ అనిత, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గ్రామ కమిటీల ఎన్నిక



ఐనవోలు : మండలంలోని పంథిని, పున్నేలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నట్లు మండల ఇన్‌చార్జ్ గుజ్జ గోపాల్‌రావు సోమవారం తెలిపారు. పంథిని గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ముంజ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఉప్పరి కొమ్మాలు, యూత్ అధ్యక్షుడిగా పొన్న కోటి, పున్నేలు అధ్యక్షుడిగా జన్ను రాజు, ప్రధానకార్యదర్శిగా గుడికందుల శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడిగా బోడ హరీష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్‌అలీ, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, పంథిని ఎంపీటీసీ సోమేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్‌లు పల్లకొండ సురేష్, బరిగల సదానందం, మండల నాయకులు తీగల లక్ష్మణ్‌గౌడ్, తాండ్ర కోమలత పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

నర్సంపేట : దళిత సమాజాన్ని అవమానపర్చారని ఆరోపిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ పార్టీ నర్సంపేట డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కల్లెపల్లి సురేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆ పార్టీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సురేశ్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేయకుండా, తాళాలు తీయించకుండా దళిత సమాజాన్ని అవమానపర్చాని ఆరోపించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి పైసా ప్రవీణ్, డివిజన్ ప్రచార కార్యదర్శి నల్ల రవీందర్, ఖానాపురం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నేలమారి నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి సవారపు నవీన్, నెక్కొండ మండల అధ్యక్షుడు ఈదునూరి రమేశ్‌పాల్గొన్నారు.



నర్సంపేట : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



దుగ్గొండి : నిరసన తెలుపుతున్న నాయకులు

దుగ్గొండి : హైదరాబాద్‌లోని సచివాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని అలంకరించకపోవడంపై మండలంలోని లక్ష్మీపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ మండల నాయకులు సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సుకినే రాజేశ్వర్‌రావు, ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య మాట్లాడారు. దేశవ్యాప్తంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న సమయంలో సాక్షాత్తు సచివాలయం ఎదుట ఉన్న విగ్రహాన్ని అలంకరించకపోవడం అంబేడ్కర్‌ను అవమానించడమేనని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మూల్యం చెల్లించక తప్పదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శానబోయిన రాజ్‌కుమార్, గుండెకారి రంగారావు, మామునూరి సుమన్, నాగనబోయిన తిరుపతి, పిండి రాజు, జాకీ, పురుషోత్తం, జన్ను ప్రవీణ్ పాల్గొన్నారు.

స్నేహితురాలికి రూ.లక్ష సాయం



దుగ్గొండి: సాయం అందిస్తున్న స్నేహితులు



చెన్నారావుపేట:సాయం అందిస్తున్న శోభన్‌బాబు

దుగ్గొండి : మండలంలోని మైసంపల్లికి చెందిన ఈద సుందరి గతేడాది అకాల గాలివాన బీభత్సానికి ఇళ్లు ధ్వంసమై చెట్టు కింద పరదాలు కట్టుకుని జీవనం సాగిస్తుండగా ఆమెతో కలిసి 1986-87 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు సోమవారం రూ.లక్ష సాయం అందజేశారు. ఆమె పేదరికంలో ఇబ్బంది పడుతుండగా రేకుల షెడ్డు పునర్నిర్మాణం కోసం సాయం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో టెన్త్ బ్యాచ్ అధ్యక్షుడు చెలకాని ధనుంజయ, కార్యదర్శి మన్నె బాబు, కోశాధికారి పులిచేరు సదానందం, సభ్యులు పిల్లారిశెట్టి లక్ష్మీ, సూరం నారాయణరెడ్డి, జెండా పుష్ప, దుండె రాజకళ, మహేందర్, రమ, లీలామణి, శోభారాణి, రవి, సంపత్, సింహాచలం, ప్రభాకర్, సుదర్శన్, రత్నాకర్, రవీంద్ర ప్రసాద్, కుమారస్వామి, కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.51,116 సాయం

చెన్నారావుపేట : మండలంలోని బోజేర్వు గ్రామానికి చెందిన ధీకొండ నాగేశ్వర్ ఇటీవల తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందగా బాధిత కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర గౌడ యూనిఫామ్ (పోలీస్, ఎక్సైజ్, ఫైర్, ట్రాన్స్‌పోర్ట్) అధికారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం రూ.51,116 సాయం అందజేశారు. ఈ మేరకు నాగేశ్వర్ సతీమణి శోభకు అసోసియేషన్ తరఫున ఇన్‌స్పెక్టర్ శోభన్‌బాబు, కార్తీక్, ఆర్ఎస్సై రంజీత్‌కుమార్, రవి, అరుణ్‌కుమార్ నగదు అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థికసాయం త్వరితగతిన అందేలా చొరవ తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు బి.యాదగిరి, డి.సమ్మయ్య, గోపా జిల్లా అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన చాపర్తి సాంబలక్ష్మి ఇటీవల హనుమకొండలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి స్థానిక రజక సంఘం ఆదర్శ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.5 వేల సాయం అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పరామర్శ

నర్సంపేట : పట్టణానికి చెందిన తొలి ఉద్యమకారుడు, సర్వోదయ స్వచ్ఛంద సంస్థ ఆవిర్భావ అధ్యక్షుడు రామగోని వెంకటేశ్వర్లుగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం పరామర్శించారు. తొలుత వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు రామగోని సుధాకర్, మద్దెల సాంబయ్య, జిల్లా కార్యదర్శి కొండి రాము, రామగోని శ్రీనివాస్, ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ గర్నేపల్లి గంగాధర్, రామగోని రంజిత్, దూపటి మనోహర్, వెంకట్, నరేశ్, సతీశ్ పాల్గొన్నారు.



గీసుకొండ : ఆర్థికసాయం అందజేస్తున్న యూత్ సభ్యులు



నర్సంపేట : వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సంక్షేమ పథకాలపై ప్రచారం



గీసుకొండ : మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ బూత్ విజయ సంకల్ప అభియాన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేలా నాయకులు సోమవారం ప్రచారం చేశారు. కేంద్రంలో బీజేపీని మరోసారి గెలిపించాలని, వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కి భారీ మెజార్టీ అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ పరకాల నియోజకవర్గ కన్వీనర్ ముల్క ప్రసాద్, నాయకులు కత్తి రమేశ్, వెంకటేశ్వర్లు, పాకనాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'మంద కృష్ణను విమర్శించే హక్కు శ్రీహరికి లేదు'

నల్లబెల్లి : ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణను విమర్శించే నైతిక హక్కు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి లేదని అణగారిన వర్గాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పరికి కోర్నెల్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతి ప్రయోజనాల కోసం త్యాగం చేసిన చరిత్ర మంద కృష్ణకు ఉండగా రాజకీయ స్వార్థం కోసం మాదిగలను అణచివేసిన చరిత్ర కడియం శ్రీహరిదని మండిపడ్డారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచి గెలవాలని సవాల్ విసిరారు. పార్లమెంట్ ఎన్నికల్లో శ్రీహరి కుటుంబానికి ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు.

యువకుడికి గాయాలు

వర్ధన్నపేట : ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న లారీని ఢీకొట్టిన ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. నెక్కొండ మండలంలోని చంద్రుగొండకు చెందిన మూడు అఖిల్ నాయక్ ద్విచక్ర వాహనంపై రాయపర్తి నుంచి వర్ధన్నపేట వైపు వస్తుండగా పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అఖిల్ తలకు గాయమైంది. ఆయనను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకరిస్తా

- 'ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా' అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలోని శిథిలావస్థకు చేరిన ముత్యాలమ్మ గుడిను పునర్నిర్మించేందుకు సహకరిస్తానని ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆ ఆలయ దుస్థితిని గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఆలయాన్ని సోమవారం సందర్శించి పరిశీలించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన సామగ్రి ఇప్పించడంతోపాటు సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ సురేందర్ రాథోడ్, ఎంపీటీసీ గోవింద్‌నాయక్, భూక్యా విజయ్‌కుమార్, అమ్మిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ యాకూబ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, తేజావత్ సంతోష్‌నాయక్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మ గుడిని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న మాజీ సర్పంచ్ ప్రకాశ్, తదితరులు

గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన చేసి రెండేళ్లు గడచిన నేపథ్యంలో సోమవారం ద్వితీయ వార్షికోత్సవం నిర్వహించారు. గ్రామ దేవతలు భూదేవి, నీలాదేవి సమేత నాభిశిల విగ్రహాలకు మహిళలు జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాశ్ కేక్ కట్ చేసి గ్రామస్తులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి డాక్టర్ వడ్డేపల్లి రమేశ్, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి సునీత, గ్రామ పెద్దలు నరిశెట్టి నరేందర్, ఆంగోతు కవిత, వేల్పుల సురేశ్, మర్రి రాజలింగం, గుండెబోయిన కుమారస్వామి, దూపటి యుగేందర్, అర్షం యాకయ్య, గటికె నాగరాజు, బిక్షపతి, జూలురి రాజు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

- నిరసనకు దిగిన మహిళలు

ఐనవోలు : మండల కేంద్రంలోని పదో వార్డులో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించాలని మహిళలు సోమవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవ కాలనీని అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ రెండు రోజులకోసారి నీరు నల్లాల ద్వారా విడుదల చేస్తున్నారని అన్నారు. నీరు వదిలిన రోజు కూడా సరిపడా ఇవ్వడం లేదని, చాలాదూరం వెళ్లి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నామని చెప్పారు. నీటి సమస్యను తాత్కాలికంగా తొలగించడానికి యాదవ కాలనీలో గతంలో వేసిన బోరుకు చేతిపంపు బిగించాలని పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రత్యేకాధికారులు గ్రామ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కాలనీ వాసుల నీటి సమస్యను పరిష్కరించాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం మండల అధ్యక్షుడు నల్లబెట్ట చిన్నరాజు కోరారు.కేతమ్మ, రామక్క, ఎల్లమ్మ, సత్తమ్మ, కొమురమ్మ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మహిళలు

వివాహిత అదృశ్యం

చెన్నారావుపేట: వివాహిత అదృశ్యమైన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాల్‌నాయక్ తండా శివారులో బాల్‌నాయక్ తండాకు చెందిన లావుడ్య దస్రు కుమార్తె నందిని ఈ నెల 8న ఇంట్లో ఎవరూ లేని సమయంలో చెప్పకుండా బయటికి వెళ్లింది. చుట్టుపక్కల ప్రదేశాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా 6 నెలల క్రితం ఓ వ్యక్తితో వివాహం జరిగింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చెన్నారావుపేట: తాళం వేసిన ఇట్లో దొంగలు పడిన ఘటన మండల కేంద్రంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన మండల మల్లేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా అతని భార్య మల్లికాంబ ఇంటిని వదిలి అదే కాలనీలో మరో ఇంట్లో కిరాయికి ఉంటుంది. వదలివెళ్లిన ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఇంటి తాళం పగులగొట్టారు. బీరువా తాళం తీసి అందులో ఉన్న తులం బంగారం, 30 తులాల వెండి (పట్టగొలుసులు, చేతి గాజులు, కడియాలు), 50 కిలోల బియ్యాన్ని అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఘటన స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్సై గూడ మహేందర్ తెలిపారు.

అవగాహనతో సైబర్ నేరాలకు చెక్

వర్ధన్నపేట : ప్రజలు అవగాహన పెంచుకోవడం ద్వారా సైబర్ నేరాలకు చెక్ పెట్టొచ్చని ఏఎస్సై శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ శంకరయ్య తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ వేదికగా సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియాలో స్నేహితులు, బంధువుల పేర్లపై బ్యాంకు ఖాతా తెరిచి అత్యవసరంగా డబ్బు కావాలని, లక్షలు, కోట్ల విలువైన లాటరీ తగిలిందని, ముందుగా కొంత డబ్బు చెల్లించాలని, తదితర మాయమాటలతో డబ్బు దండుకుంటున్నారని చెప్పారు. సైబర్ నేరాల బారిన పడి డబ్బు పోగొట్టుకుంటే బాధితులు వెంటనే జాతీయ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ 1930తోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న వెబ్‌సైట్‌లకు లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తద్వారా పోగొట్టుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్ల ఖాతా నుంచి బదిలీ కాకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బుచ్చిరాజు, పాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్సై శంకరయ్య

ఆయకట్టుకు సాగునీరు అందించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నర్సంపేట : మండలంలోని మాదన్నపేట చెరువు రబీ ఆయకట్టుకు సాగునీరు అందించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు ఆయకట్టు రైతులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుదూ రబీ సాగుకు నీటి పారుదల శాఖ అధికారులు చెరువు నీటి అంచనాతో 800 ఎకరాల్లో వరి సాగుకు తైబందీ నిర్ణయించగా ఎండల తీవ్రతతో చెరువులో నీరు త్వరగా అడుగంటి నాలుగు ఫీట్లకు చేరుకుందని చెప్పారు. పంటలు చేతికి అందాలంటే మరో 20-25 రోజులపాటు సాగునీరు అవసరమని తెలిపారు. ప్రస్తుత నీరు పెద్ద తూము ద్వారా వేగం తగ్గడంతో ఆయకట్టుకు నీరందక పంటలు ఎండిపోయే దుస్థితి నెలకొందన్నారు. ఈ క్రమంలో చెరువులోని నీటిని మోటార్ల ద్వారా పెద్ద కాల్వ తూములోకి ఎత్తిపోసి పైర్లను కాపాడాలని, తక్షణమే మోటార్లు అమర్చేలా నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, జి.కిషన్, తదితరులున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

నల్లబెల్లి : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని నర్సంపేట రూరల్ సీఐ రాజగోపాల్ కోరారు. మండలంలోని నారక్కపేట, గుండ్లపహాడ్, రుద్రగూడెం, రంగాపురం, రేలకుంట, నందిగామ, లెంకాలపల్లి, నల్లబెల్లి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఎస్సై రామారావుతో కలిసి సోమవారం సీఐ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన భద్రతా చర్యలపై ఎస్సైతో చర్చించారు. ఆయా గ్రామాల్లో యువతతో సమావేశాలు ఏర్పాటు చేసి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో స్వేచ్ఛగా ఓటేయాలని కోరారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చెప్పారు.



మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ సారయ్య, బాలవికాస ప్రతినిధి రమ

రాయపర్తి : బాటసారుల, ప్రయాణికుల దాహార్తి తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు బాలవికాస ప్రతినిధి వై.రమ తెలిపారు. మండలంలోని సన్నూరులో మాజీ సర్పంచ్ నలమాస సారయ్య సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎండల తీవ్రత నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. సామాజిక సేవలు నిర్వహించడానికి ప్రజలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నలమాస సారయ్య, బాలవికాస కోఆర్డినేటర్ సరిత, తదితరులు పాల్గొన్నారు.

ఎంత ప్యాకేజీతో కాంగ్రెస్‌లోకి వెళ్లారు?

ఖానాపురం : గతంలో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఎంత ప్యాకేజీ తీసుకుని కాంగ్రెస్‌లోకి వెళ్లారని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు ప్రశ్నించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నకిలీ మందులతో రైతులను ఒకరు మోసం చేశారని, మరొకరు సర్పంచ్‌గా పని చేసి కొన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు ఆస్తుల కోసమే రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పేదలపై ప్రేమఉంటే డీలర్‌షిప్ ఎందుకు ఇవ్వడం లేదన్నారు. తనపై పోటీ చేసే ధైర్యం లేకపోయినా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని చెప్పారు. సీడీఎఫ్ నిధులను నాయకులు పంచుకుంటున్నారని ఆరోపించారు. అవినీతి ఎక్కడ జరిగిందో, బార్దాన్ ఎక్కడకు పోయిందో చూపెట్టగలరా అని ప్రశ్నించారు. జీఓలు, అభివృద్ధిపై చర్చించడానికి ఈనెల 19న స్థానిక హనుమాన్ సెంటర్ వద్ద బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. సమావేశంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, కో ఆప్షన్ సభ్యుడు మస్తాన్, నాయకులు వల్లెపు శ్రీనివాస్, జేరిపోతుల వెంకటేశ్వర్లు, వేల్పుల లింగయ్య, ఉపేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

ఎన్నికల్లో 'అరూరి' గెలుపు ఖాయం

పరకాల : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు ఖాయమని ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. పరకాల నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీకి పెరుగుతున్న ప్రజాధరణతోపాటు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులపై ఉన్న వ్యతిరేకతతో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే పరకాల నియోజకవర్గంలోనే 50వేల మెజార్టీ వస్తుందని జోస్యం చెప్పారు. తండ్రి పేరు చెప్పుకొని కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య బరిలో నిలవడం, బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తి అని, కానీ ప్రజలు అరూరిని గెలుపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, కాచం గురుప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, నాయకులు దేవునూరి మేఘనాథ్, పట్టణ ప్రధాన కార్యదర్శి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కాళీప్రసాద్‌రావు